ప్రచురణార్థమైన

**భారత దేశసర్వోన్నత న్యాయస్థానము**

**సివిల్ అప్పీలు అధికార పరిధి**

**సివిలు అప్పీలు నంబరు 128/2023**

**గురుదీప్ సింగ్** **.... అప్పీలుదారు(లు)**

**వర్సెస్**

**రే గౌండ శ్రీనివాస్ మరియు ఇతరులు** **.... ప్రతివాదు (లు)**

**సహితంగా**

**సివిలు అప్పీలు నెంబరు.92/2023**

**తీర్పు**

**నాగరత్న న్యాయమూర్తి.**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తేది.30-12-2022 న ప్రతివాదులచే దాఖలు చేయబడిన కోర్టు ధిక్కరణ కేసు(కంటెమ్ప్ట్ కేసు)నెంబరు.776/2022 ను అనుమతిస్తూ జారీ చేసిన తీర్పులో అప్పీలుదారులు ఎన్‌టిపిసీ సంస్థ –కంపెనీ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ మరియు జనరల్ మేనేజరు(మానవ వనరులు) (హ్యూమన్ రిసోర్సెస్)లకు రెండు నెలల సాధారణ జైలు శిక్ష , మరియు రూ. 2,000/- (రెండు వేల రూపాయలు)లను జరిమానా విధిస్తూ వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ ప్రస్తుత ఈ అప్పీళ్ళను దాఖలు చేశారు.

2. హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం రిట్ అప్పీలు నంబరు.277/2020లో 17-12-2021 తేదీన వెలువరించిన ఉమ్మడి తీర్పును అప్పీలుదారులు బుద్ధి పూర్వకంగా, ఉద్దేశ పూర్వకమైన అవిధేయతతో అమలు చేయకపోవడమన్నది జరగలేదని ప్రధానంగా పేర్కొంటూ ప్రస్తుత అప్పీళ్లు దాఖలయ్యాయి.

3. ప్రస్తుత కేసు ప్రతివాదులు , అదేవిధంగా ఇతర భూ నిర్వాసితులను జూనియర్ మజ్దూర్ పోస్టుల్లో నియమించాలని 1988 సంవత్సరంలో ఎన్టీపీసీ సంస్థ భూ నిర్వాసితులతో కుదుర్చుకున్న త్రైపాక్షిక ఒప్పందానికి సంబంధించినది.

4. ఈ అప్పీళ్లకు దారి తీసిన పరిస్థితులు క్లుప్తంగా... ప్రస్తుత ప్రతివాదులు , అదే విధంగా పలువురు భూనిర్వాసితులు కరీంనగర్ జిల్లా , రామ గుండం మండలంలోని వివిధ గ్రామాలలోని భిన్న భిన్న విస్తీర్ణంలోని భూములకు సంపూర్ణ యజమానులు మరియు స్వాధీనదారులు. ఈ భూములను 1980 కన్నా ముందు ఎన్టీపీసీ సేకరించింది మరియు ఈ భూములను సేకరించినందుకు పరిహారం ప్రకటిస్తూ ఒక అధి నిర్ణయాన్ని (అవార్డు) జారీ చేసింది. ఈ మేరకు భూ నిర్వాసితులకు పరిహారంగా జూనియర్ మజ్దూర్ పోస్టుల్లో నియమించాలని ఎన్టీపీసీ ప్రతిపాదించింది. 15-05-2015 తేదీన ఎన్టీపీసీలో 25 జూనియర్ మజ్దూర్ పోస్టుల భర్తీకి అర్హులైన భూ నిర్వాసితుల పేర్లను వెల్లడించడం కోసం ఎన్టీపీసీ ఉద్యోగ సూచన ప్రకటన(ఎంప్లాయ్ మెంట్ నోటిఫికేషన్) నంబరు.2/2015ను విడుదల చేసింది.

5. ఎన్టీపీసీ 2015 సంవత్సరంలో విడుదల చేసిన పైన పేర్కొనబడిన ఉద్యోగ సూచన ప్రకటన మరియు సదరు ప్రకటనకు అనుగుణంగా ఎన్టీపీసీ చేపట్టిన నియామక ప్రక్రియను సవాలు చేస్తూ భూ నిర్వాసితులలోని ఒకరు రిట్ పిటిషన్ నంబరు.26043/2016 దాఖలు చేశారు మరియు హైకోర్టులోని గౌరవనీయ సింగిల్ జడ్జి , నియామక ప్రక్రియ కేవలం మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ) ద్వారా ఉండటంతో దాన్నికొట్టి వేశారు.

6. ఎన్టీపీసీ జూనియర్ ను మజ్దూర్ ల నియామకానికి 09-03-2017 తేదీన ఉద్యోగ సూచన ప్రకటన నంబరు.1/2017 విడుదల చేయడంతో వివాదము మరీ ఉధృతమైనట్లయింది. ఇది కూడ హైకోర్టులో సవాలు చేయబడింది. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం రిట్ అప్పీలు నంబరు.277/2020లో ఉత్తర్వులు వెలువరిస్తూ ఉద్యోగ సూచన ప్రకటన న ంబరు.1/2017 ప్రకారం పూర్తి నియామక ప్రక్రియకు తీర్పు వెలువరించిన తేదీ, 17-12-2021 నుండి రెండు నెలల్లో పూర్తి చేయాలని ఎన్టీపీసీని ఆదేశించింది.

7. 17-12-2021 తేదీ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తాజా ఉద్యోగ సూచన ప్రకటన నంబరు. 1/2022 విడుదల చేసి నియామక ప్రక్రియను ప్రారంభించడంతో 09-03-2017 తేదీ ఉద్యోగ సూచన ప్రకటన నంబరు.1/ 2017 ను రద్దు చేశారు.

8. విషయాలు ఇలా ఉండగా , ప్రస్తుత ప్రతివాదులు 17-12-2021 తేదీ నాటి హైకోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా పాటించనందుకు/అమలు చేయనందుకు మరియు బుద్ధి పూర్వకంగా ఉల్లంఘించినందుకు ప్రస్తుత అప్పీలుదారులు కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా పరిగణించాలని అందుకు వారిని శిక్షించాలని అభ్యర్థిస్తూ కోర్టు ధిక్కరణ కేసు నంబరు.776/2022ను దాఖలు చేశారు. సదరు కోర్టు ధిక్కరణ కేసులో 30-12-2022 తేదీన వివాదాస్పద తీర్పు వెలువరిస్తూ, రిట్ అప్పీలు నెంబరు.277/2020 బ్యాచ్ కేసుల్లో 17-12-2021 తేదీన వెలువరించిన తీర్పు పర్యవసానం తెలిసి కూడా అప్పీలుదారులు ఉద్దేశ పూర్వకంగాను , బుద్ధి పూర్వకంగాను మరియు కర్తవ్యలోపాలు, తప్పులు ఉన్నందు వల్ల కోర్టుధిక్కరణ కేసును, అనుమతిస్తూ అప్పీలుదారులకు రెండు (02) నెలల పాటు సాధారణ జైలు శిక్ష మరియు ఒక్కొక్కరికి రూ. 2,000/-(రెండు వేల రూపాయలు) జరిమానా విధిస్తూ , తీర్పు వెలువడిన తేదీ నుండి నాలుగు (04) వారాల్లో చెల్లించాలని ఆదేశించారు.

9. వివాదాస్పద తీర్పులో తెలంగాణ హైకోర్టు వెలువరించిన కీలక పరిశీలనలు ఈ కింది విధంగా ఉన్నాయి:

ఎ. 09-03-2017 తేదీ ఉద్యోగ సూచన ప్రకటన నంబరు.1/2017కి అనుగుణంగా అప్పీలుదారులు నియామక ప్రక్రియను తీర్పు వెలువడిన రెండు నెలల్లో పూర్తి చేసి అదే సమయంలో పర్యవసాన నియామక ఉత్తర్వులను జారీ చేసి ఉండాల్సింది.

బి. ఉద్యోగ సూచన ప్రకటన నంబరు.1/2022ను జారీ చేయడంలోను మరియు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం 17-12-2021 తేదీన రిట్ అప్పీలు నంబరు. 277/2020 బ్యాచ్ కేసులో వెలువరించిన తీర్పును తిరస్కరించే ప్రయత్నం చేయడంలో అప్పీలుదారులు కీలక వ్యక్తులు.

సి. అప్పీలుదారులు మరియు ఎన్.టి.పీ.సి. సంస్థ 17-12-2021 తేదీ నాటి కోర్టు ఆదేశాలను పాటించడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయకుండా చట్టం మరియు హైకోర్టు ఉత్తర్వు పట్ల తమకున్న చిన్నపాటి గౌరవాన్ని ప్రదర్శించారు.

డి.   హైకోర్టు నిర్దేశించిన విధంగా నియామక ప్రక్రియను పూర్తి చేయడానికి బదులుగా , అప్పీలుదారులు తాజా ఉద్యోగ సూచన ప్రకటన (01-02-2022 తేదీ ఉద్యోగ సూచన ప్రకటన) జారీ  చేయడం ద్వారా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు మరియు 09-03-2017 తేదీ ఉద్యోగ సూచన ప్రకటన నెం.1/2017 ద్వారా ప్రారంభించిన నియామక ప్రక్రియను రద్దు చేశారు.

ఇ.   అప్పీలుదారులు నివేదించిన బేషరతు క్షమాపణ హైకోర్టు గుర్తించింది , అయితే వారు ఎటువంటి క్షమాపణకు అర్హులు కాదని పేర్కొంటూ దానిని అంగీకరించేందుకు నిరాకరించింది.  హైకోర్టు పరిశీలనలతో వేదన చెందిన దోషస్థాపిత వ్యక్తులు – అప్పీలు దారులు  ప్రస్తుత అప్పీళ్లు దాఖలు చేశారు.

10.  అప్పీలుదారుల తరపున విద్యావంతులైన సొలిసిటర్ జనరల్ వాదనలను ప్రతివాదులు 1 నుండి 7 తరపున విద్యావంతులైన న్యాయవాది మిస్టర్ అరుణ్ కె. సిన్హా వాదనలను విన్నాము.

11.  వాదనల సందర్భంలో విద్యావంతులైన సొలిసిటర్ జనరల్ వివాదాస్పదమైన తీర్పులోని 10 నుండి 12 వరకు గల పేరాలను మాదృష్టికి తీసుకువచ్చారు. అవి ఈ కింది విధంగా ఉన్నాయి:-

"10. కేసు పరిస్థితుల దృష్ట్యా , 1మరియు 2వ ప్రతివాదులు బేషరతుగా క్షమాపణలు చెప్పినప్పటికి , ఉద్దేశపూర్వకంగా మరియు బుద్ధి పూర్వకంగా ఈ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించినందు వల్ల వారు ఎటువంటి క్షమకు అర్హులు కారు మరియు ఆవిధమైన బేషరతు క్షమాపణలను ఈ కోర్టు అంగీకరిచడానికి  నిరాకరిస్తుంది.

11.  పైన పేర్కొనబడిన కారణాల వలన , రిట్ అప్పీలు.నెంబరు.277/2020 బ్యాచ్ కేసుల్లో ఈ కోర్టు ద్విసభ్య ధర్మాసనం 17-12-2021 తేదీన వెలువరించిన ఉత్తర్వులను 1 మరియు 2వ ప్రతివాదులు ఉద్దేశపూర్వకంగా మరియు బుద్ధి పూర్వకంగా  ఉల్లంఘించారని మేము నిర్ధారిస్తున్నాము మరియు వారు అందుకు శిక్షార్హులు.

12.  తదనుసారం , కోర్టు ధిక్కరణ కేసు అనుమతించబడింది. 1మరియు 2వ ప్రతివాదులకు రెండు (02) నెలల సాధారణ జైలు శిక్ష మరియు ఒక్కొక్కరు రూ. 2000/- (రెండు వేల రూపాయలు మాత్రమే) జరిమానాను , ఈ రోజు నుండి

నాలుగు (04) వారాలలో చెల్లించవలెను. రోజుకు రూ.500/-ల చొప్పున జీవన భృతిని నాలుగు వారాల లోగా డిపాజిట్ చేయాల్సిందిగా పిటిషనర్లకు ఆదేశించడమైనది .1

మరియు 2వ ప్రతివాదులపై విధించిన జైలు శిక్ష నేటి నుండి ఆరు (06) వారాల పాటు తాత్కాలికంగా నిలుపుదల చేయడమైనది."

17-12-2021 తేదీన హైకోర్టు వెలువరించిన ఉత్తర్వులను అప్పీలు దారులు ఉద్దేశ పూర్వకంగాను, బుద్ధి పూర్వకంగాను ఉల్లంఘించినట్లుగా స్పష్టంగా లేనందున అప్పీలుదారులు నివేదించిన బేషరతు క్షమాపణలను హైకోర్టు అంగీకరించి ఉండాల్సిందని ఆయన విన్నవించారు. ఈ సందర్భంలో రిట్ అప్పీలు నంబర్లు.270 , 277 మరియు 268/2020లలో 17-12-2021 తేదీన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పును మా దృష్టికి తీసుకు వచ్చారు , ఉత్తర్వులోని సంబంధిత భాగం ఈ కింది విధంగా ఉంది:

"భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలనే విధానపరమైన నిర్ణయం మేరకు గ్రూప్ "డి" ఉద్యోగుల పోస్టులకు నియామక ప్రక్రియతో ఎన్టీపీసీ ముందుకు సాగుతోంది మరియు 2017 సంవత్సరం నుండి వ్యాజ్యాల కారణంగా నియామక ప్రక్రియ నిలిపివేయబడింది. రాత పూర్వక పరీక్ష నిర్వహించడం ద్వారా ఎన్టీపీసీ పారదర్శకమైన ప్రక్రియను అవలంబించింది. మరియు నిబంధనలను కూడా సవరించింది మరియు 15-05-2015 తేదీ నాటి ఉద్యోగ సూచన ప్రకటనను రద్దు చేసి 12-03-2017 తేదీన తాజాగా ఉద్యోగ సూచన ప్రకటన జారీ చేయడంలో ఎన్టీపీసీ తీసుకున్న నిర్ణయంలో ఈ కోర్టు ఎలాంటి తప్పు పట్టడం లేదు. ఎన్టీపీసీ ఇంతకు ముందు మౌఖిక పరీక్ష ( ఇంటర్వ్యూ) ప్రక్రియను నిర్వహించిందని భావించినప్పటికి నియామక ప్రక్రియ పూర్తి కాలేదు మరియు 15-05-2015 తేదీ నాటి ఉద్యోగ సూచన ప్రకటనకు అనుగుణంగా ఎన్టీపీసీ ఎటువంటి నియమకాలు చేపట్టలేదు మరియు ఎంపిక జాబితాలో చేర్చినంత మాత్రాన సదరు వ్యక్తికి నియామక హక్కును ప్రసాదించినట్టు కాదన్నది చట్ట బద్ధమైన ప్రతిపాదన.

15-05-2015 తేదీ నాటి మునుపటి ప్రకటనను రద్దు పరచడానికి గల కారణాలు సముచితమైనవి మరియు న్యాయమైనవి మరియు ఎన్టీపీసీ ఇప్పుడు పారదర్శక ప్రక్రియను అవలంభిస్తున్నందున , గౌరవనీయ సింగిల్ జడ్జి వెలువరించిన వివాదాస్పద ఉత్తర్వు కొట్టివేయబడింది. విషయ నియామక

ప్రక్రియను ఈ రోజు నుండి రెండు నెలల్లో , పూర్తి చేసి సంభవనీయ నియామక పత్రాలను అందజేయాలని ఎన్టీపీసీని ఆదేశించడమైనది.

పైన పేర్కొన్న ప్రకారం , రిట్ అప్పీళ్లు అనుమతిస్తూ తీర్పు చేయడమైనది. వివిధ దరఖాస్తులు ఏమైనా పెండింగ్ లో ఉంటే వాటిని ముగించడమైనది. ఖర్చుల ఉత్తర్వులు లేవు."

పూర్తి నియామక ప్రక్రియను ఆ రోజు నుండి రెండు నెలల్లో పూర్తి చేయాలని మరియు అట్టి పరిణామాల ఫలితంగా నియామక ఉత్తర్వులను అందజేయాలని హైకోర్టు ఆదేశించినందున , నియామక ప్రక్రియను కొనసాగించిబడినది , ఎంపిక జాబితా కూడా సిద్ధం చేయబడినది. అయితే , ప్రతివాదులు కోర్టు ధిక్కరణ కేసు ప్రవేశపెట్టినందు వల్ల నియామక ఉత్తర్వులు తాత్కాలికంగా జారీ చేయ బడ్డాయని విద్యాంతులైన సొలిసిటర్ జనరల్ నివేదించారు.

ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకుని తగిన విధంగా ఉత్తర్వులు జారీ చేయవచ్చని ఆయన వాదించారు.

12. విద్యావంతులైన న్యాయవాది శ్రీ అరుణ్ కె. సిన్హా వాదనలు వినిపిస్తూ , ప్రతివాదులు భూ నిర్వాసితులని, వాళ్లు నియామకానికి అర్హులని , నిజానికి వాళ్ల పేర్లు మునుపటి 2015 ఎంపిక జాబితాలో పేర్కొనబడ్డాయన్న కారణంగా ప్రతివాదులు కోర్టు ధిక్కరణ పిటిషన్ ను దాఖలు చేయడానికి సిద్ధమయ్యారని, అందువలన, ఎటువంటి నియామకాలు జరగకపోవడంతో వారు కోర్టు ధిక్కరణ పిటిషన్ ను దాఖలు చేయాల్సి వచ్చిందని వెల్లడించారు. అయినప్పటికి , ఆయన వాదనలు వినిపిస్తూ, ప్రస్తుత అప్పీలుదారులు నివేదించిన బేషరతు క్షమాపణలను హైకోర్టు ఆమోదించకపోవటానికి గల కారణాలను పరిశీలించి కోర్టు ధిక్కరణ పిటిషన్ లో సముచిత ఉత్తర్వులు జారీ చేయవలసిందని అభ్యర్థించారు. ఆయన ఇంకా వాదిస్తూ ప్రస్తుత ప్రతివాదులను సంస్థలో నియమించే అంశాన్ని పరిశీలించాల్సిందిగా అప్పీలుదారులను ఆదేశించాలని కోరారు.

13. 17-12-2021 తేదీ తీర్పును పరిశీలించినప్పుడు నియామక ప్రక్రియను పూర్తి చేయడానికి అప్పీలుదారులను తాజా ఉద్యోగ సూచన ప్రకటన జారీ చేయకుండా నిరోధించే ఉద్దేశం బయటపడలేదు. నియామక ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు జారీ చేయాలని మాత్రమే తీర్పులో ఆదేశించబడింది. 2017 ఉద్యోగ సూచన ప్రకటనకు అనుగుణంగా నియామకాలు పూర్తి చేయాలా లేక తాజాగా ఉద్యోగ సూచన ప్రకటన వెలువరించాలా

అన్నది తీర్పులో పేర్కొనబడలేదు , అందువల్ల , మా దృష్టిలో ఈ అంశాన్ని అప్పీలుదారుల విచక్షణకు వదిలి వేయబడింది. 2017 ఉద్యోగ సూచన ప్రకటనకు అనుగుణంగా మాత్రమే నియామకాలు పూర్తి చేయాలని నిర్దిష్టమైన ఆదేశం లేకపోవడంతో తాజా ఉద్యోగ సూచన ప్రకటన జారీ చేయడమన్నది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని మేము నిర్ధారించలేకున్నాము. నియామకాలను పూర్తి చేయడానికి ఒక నిర్దేశిత సమయాన్ని కోర్టు స్పష్టంగా నిర్ధేశించింది , అయితే నియమకాలను పూర్తి చేయాల్సిన విధానం మాత్రం అప్పీలుదారుల అధికార పరిధిలోనిది.

ప్రతివాదులు ప్రవేశ పెట్టిన కోర్టు ధిక్కరణ కేసు పెండింగులో ఉన్నందున తాత్కాలిక నియామక ఉత్తర్వులను మాత్రమే జారీ చేయవచ్చన్న విద్యావంతులైన సొలిసిటర్ జనరల్ వాదనను మేము పరిగణనలోకి తీసుకున్నాము.

14. అప్పీలుదారుల తరపున విద్యావంతులైన సొలిసిటర్ జనరల్ వాదనలను మరియు ప్రతివాదుల తరపున విద్యావంతులైన న్యాయవాది వాదనలను విన్న తర్వాత మరియు ఈ తీర్పులో పైన తెలిపిన వాస్తవాల దృష్ట్యా మరియు హైకోర్టు 17-12-2021 తేదీన వెలువరించిన ఉత్తర్వుల నేపథ్యంలో, హైకోర్టు ఉత్తర్వులను పాటించడంలో "ఉద్దేశ పూర్వకమైన మరియు బుద్ధి పూర్వకమైన" అవిధేయత లేదని మేము అభిప్రాయ పడుతున్నాము. వాస్తవానికి , ప్రస్తుత అప్పీలుదారులు 17-12-2021 తేదీనాటి హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్న ఆరోపణపై బేషరతు క్షమాపణలు కూడా నివేదించారు. ఒకవేళ ఉద్దేశపూర్వకమైన మరియు బుద్ధిపూర్వకమైన అవిధేయత ఉన్నట్లుగా హైకోర్టు నిర్ధారణకు వచ్చినప్పటికీ, అప్పీలుదారులు నివేదించిన బేషరతు క్షమాపణలను పరిగణలోకి తీసుకుని విషయాన్ని ముగించి ఉండవచ్చు. అయితే , అప్పీలుదారులు నివేదించిన బేషరతు క్షమాపణలను పరిశీలించడానికి బదులుగా వారికి సాధారణ జైలు శిక్ష మరియు జరిమానా విధించినట్టుగా మేము గమనించాము. కేసులోని వాస్తవాలు మరియు 17-12-2021 తేదీన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన ఉత్తర్వుల నేపథ్యంలో విధించిన జైలుశిక్ష , జరిమానా సరైనదని మేము భావించడం లేదు.

15. ఈ తీర్పులోని వాస్తవాలు మరియు పరిస్థితుల దృష్ట్యా , ప్రస్తుత అప్పీలుదారుల బేషరతు క్షమాపణలను అంగీకరించడం సముచితమని మేము భావిస్తున్నాము మరియు తత్ఫలితంగా వారికి

విధించిన శిక్షను కొట్టి వేయడమైనది. పైన చెప్పిన నిబంధనలననుసరించి సివిల్ అప్పీళ్లు అనుమతిస్తూ తీర్పు చేయడమైనది.

వివిధ పిటిషన్ (లు) ఏమైనా పెండింగ్ లో ఉంటే , వాటిని ముగించడమైనది.

న్యాయమూర్తి.

(బి.వి.నాగరత్న)

న్యాయమూర్తి.

(ప్రశాంత్ కుమార్ మిశ్రా)

న్యూఢిల్లీ:
జూలై 04, 2023.